## సింగరేణి విస్తరణ - నిర్వాసితులు

# పర్యావరణంపై సదస్సు

**ప్రజలారా!**

"పరిశ్రమల కోసం సారవంతమైన వ్యవసాయ భూములు తీసుకోకూడదు" అన్న ప్రకటన అధికార కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల నుంచి మీరు ఎన్నిసార్లు విని ఉన్నారు? కొన్ని డజన్లసార్లు విని ఉంటారు. ఊరటకోసం ఇటువంటి ప్రకటనలు ఇస్తూ ఎప్పటిలాగే పరిశ్రమలకు ఎక్కడ అవసరమనుకుంటే అక్కడ, ఎంత అవసరం అనుకుంటే అంత భూమిని ఎటువంటిదైనా సరే బలవంతంగా సేకరించి అప్పగించడం మన పాలకులకు అలవాటయిపోయింది.

దేశ స్థాయిలో ఒక న్యాయమైన పునరావాస విధానమేదీ లేకుండా పరిశ్రమల కోసం, ప్రాజెక్టులకోసం భూసేకరణ చేసుకుంటూ పోతే నిరాశ్రయులైన ప్రజలు ఏమైపోవాలన్న ప్రశ్నకు జవాబుగా "జాతీయ పునరావాస విధానం" అదిగో వచ్చేస్తోంది, ఇదిగో వచ్చేస్తుంది అంటున్నారు. కానీ అదింకా రాకముందే దాని రూపురేఖలూ మంచి చెడులూ తెలియక ముందే భూసేకరణ మాత్రం చేసుకుంటూ పోతున్నారు. ఏమంటే దేశ అభివృద్ధి 'అర్జెన్సీ' ఉన్న విషయమనీ అది ఆగజాలదనీ అంటున్నారు. ఊరి ప్రజల ప్రాణాల్నీ, జీవితాల్నీ కాపాడే బాధ్యతకు 'అర్జెన్సీ' లేదా? ప్రజామోదం పొందిన సమగ్ర పునరావాస విధానం వచ్చేదాకా భూసేకరణ ప్రక్రియను ఆపవచ్చు కదా? వ్యవసాయం మీద, భూమిమీద, ప్రకృతి మీద ఆధారపడి బతికే ప్రజలంటే చిన్నచూపు తప్ప వేరే ఏమైనా కారణముందా ఈ వైఖరికి?

సింగరేణి యాజమాన్యం రామగుండం రీజియన్‌లో ప్రస్తుతం నడుస్తున్న నాలుగు ఓసిపి ప్రాజెక్టులకోసం భూసేకరణ జరిపింది. మానవహక్కుల వేదిక ఈ నాలుగు ఓసిపి గనులకు భూములు అప్పగించిన గ్రామాల ప్రజలను కలిసింది. ఏ గ్రామ ప్రజలు కూడా ఓసిపి ప్రాజెక్టులు రావడంవల్ల బాగుపడ్డామని చెప్పలేదు సరికదా కొత్త సమస్యలు తెచ్చుకున్నామని తమ బాధలను ఏకరువు పెట్టారు. సింగరేణి యాజమాన్యం తమకు భూములు అప్పగించిన స్థానికుల ప్రయోజనాలను పక్కకు పెట్టి తమ అవసరాలనే చూసుకుంది. అస్తవ్యస్తంగా భూసేకరణ జరపడం వల్ల భూములున్న కొందరు లాభపడితే మెజారిటీ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. మేడిపెల్లి ఓసిపి కింద మేడిపెల్లి గ్రామశివారు భూములను

సింగరేణి యాజమాన్యం తీసుకొని రైతులకు నష్టపరిహారం చెల్లిస్తే ఆ భూముల్లో విస్తారంగా ఉన్న తాడిచెట్లపై ఆధారపడి బతుకుతున్న గౌడ కులస్థులు వందల సంఖ్యలో జీవనాధారాన్ని కోల్పోయి బజారునపడ్డారు. మేడిపెల్లి, మారేడువాక గ్రామాల పంట పొలాలను స్వాధీనం చేసుకున్న యాజమాన్యం నివాసగృహాలను మాత్రం వదిలివేసి వాళ్ల ఇళ్ళ పక్కనుండే ప్రాజెక్టును ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు దినమొక గండంగా గడుపుతున్నారు. ప్రాజెక్టుల్లో జరిగే భారీ బ్లాస్టింగ్‌ల వల్ల కలిగే వైబ్రేషన్‌లకు ఇళ్ళు బీటలువారి కూలిపోతున్నాయి. ఓసిపి ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయే రైతులకు మాత్రమే అరకొరగా నష్టపరిహారం అందుతుంది. భూమిలేని అనేకమంది వివిధ గ్రామీణ వృత్తుల వారికి ఏవిధమైన పరిహారం అందడం లేదు. ఇంతకాలం ఊరిని నమ్ముకొని శ్రమచేసుకొని బతికిన వారికి కూడా జీవనాధారం చూపించాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రభుత్వంగానీ, సింగరేణి యాజమాన్యంగానీ గుర్తించడం లేదు.

ఓసిపి ప్రాజెక్టులు 150 నుంచి 300 మీటర్ల లోతుకు పోతున్నందున భూగర్భ జలాలు, బావులు ఇంకిపోయి అడుగంటిపోతున్నాయి. గ్రామాల చుట్టూ పోసిన మట్టిగుట్టల కారణంగా రవాణా సౌకర్యాలు అస్తవ్యస్తమై పోతున్నాయి. ఓసిపి నుంచి వెలువడుతున్న విష యవాయువులు, దుమ్ము, శబ్ద కాలుష్యాలవల్ల ప్రజలు అనారోగ్యం పాలవడమేగాక పరిసర ప్రాంత పంటపొలాల్లో దిగుబడి తగ్గిపోతోంది. ఓసిపిల నుంచి వెలువడుతున్న కాలుష్యపు నీరు కారణంగా సమీపంలోని చెరువులు కలుషితమైపోయాయి. 20 సంవత్సరాల కింద రామగుండం రీజియన్‌లో ఓపెన్‌కాస్టులు ప్రారంభమైతే నిర్వాసితులకు ఈరోజు వరకు కూడా పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందక కేసులు కోర్టులో మూలుగుతున్నాయి. యాజమాన్యం కోర్టు గడపలో నిర్వాసితుల బ్రతుకుల్ని బందీచేసి యదేచ్ఛగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను తవ్వుకుంటూ పోతోంది. ఇది ఓసిపి నిర్వాసిత గ్రామాల ప్రజల వాస్తవ పరిస్థితి. బొగ్గు గనుల తవ్వకాలకు తమ భూములను అందించి, తమ బతుకుల్లో మంటలు పెట్టుకున్న నిర్వాసితుల దయనీయమైన స్థితి ఇది. వెన్నెముకలేని కాలుష్య నియంత్రణ అధికారులు ప్రజల అభ్యంతరాలను పక్కనపెట్టి అనుమతులిస్తున్నారు. దేశ అభివృద్ధికి బొగ్గు అవసరం లేదని ఎవ్వరూ అనరు. అయితే వ్యవసాయమూ, ప్రజల ఆరోగ్యమూ, సంక్షేమమూ కూడా అవసరం కాదా? దానికీ దీనికీ మధ్య సమతుల్యం పాటించే సమగ్ర విధానమేదీ లేకుండా పారిశ్రామిక అభివృద్ధి పెరుగుదలకీ పెద్దపీట వేయడం సమంజసమా?

ఆదిలాబాద్ తూర్పు డివిజన్‌లో సింగరేణి యాజమాన్యం ప్రారంభిస్తున్న ఓసిపి ప్రాజెక్టుల విషయానికి వస్తే వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కోల్‌బెల్ట్ ప్రాంతాలు రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రిలు. రామకృష్ణాపూర్‌లో ప్రారంభిస్తున్న ఓసిపి ప్రాజెక్టు ప్రాంతం సింగరేణి ఆధీనంలో ఉన్న ఊరేగాబట్టి వెంటనే ప్రారంభించడానికి యాజమాన్యం సిద్ధపడుతోంది. కానీ రామకృష్ణాపూర్‌లో ప్రారంభమయ్యే ఓసిపి వల్ల క్యాతన్‌పల్లి, శేషపెల్లి, అమరవాజి, కుర్మపల్లి గ్రామాలలో నివసిస్తున్న దాదాపు 30 వేల ప్రజానీకం ఓసిపిల ప్రభావానికి గ్రామాలు వదిలివెళ్ళాల్సిందే, వారి పంటపొలాలు బీళ్ళుగా మారవలసిందే. అదే

విధంగా బెల్లంపల్లి టౌన్‌లో ప్రారంభమవుతున్న ఓసిపి ప్రాజెక్టు వల్ల చిన్నబూదె, కాశిరెడ్డిపల్లి, సంద్రావెల్లి, తాళ్ళ గురిజాల, రంగంపేట, దుద్దెనపల్లి, మాలగురిజాల గ్రామాల ప్రజలు కూడా పైప్రభావానికి గురికావాల్సిందే.

మందమర్రి సమీపంలోని శ్రావణపల్లి ఓసిపి ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజల సమస్య ప్రత్యేకమైనది. అక్కడ 400 ఎకరాల మామిడితోటలను, అంతే విస్తృతి గల పంట పొలాలను కబళించే ఓసిపి నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం ఒడిగట్టింది. నేతకాని కులానికి చెందిన దళితులు నివసించే జెండావెంకటాపూర్, పూర్తిగా లంబాడా గిరిజనులు నివసించే శ్రావణపల్లి తమ జీవనాధారాన్ని సంపూర్ణంగా కోల్పోతాయి. ఈ రెండు గ్రామాలూ నెన్నెల మండలంలో ఉన్నాయి. వాటితోపాటు మందమర్రి మండలం మామిడిగట్టు కూడా తన శివారు మొత్తం కోల్పోతుంది. ఈ మూడు గ్రామాలలో పశుసంపద చాలా ఉంది. వరిగడ్డీ, అడవులలో దొరికే మేత వాటికి మంచి పౌష్టికాహారం. వీటి పాలు గ్రామస్తులకు మంచి ఆదాయం. భూములుపోతే ఈ పశువులను అమ్ముకోవలసిందే. ఈ మూడు గ్రామాలకు సంవత్సరంలో కనీసం రెండు నెలలు వచ్చి కూలీ చేసుకునే చిత్తాపూర్, కొత్తూరు, నర్వాయిపేట, జోగాపూర్, ఆదిల్‌పేట, పొన్నారం గ్రామాల పేదలు కూలివల్ల దొరికే జీవనాధారాన్ని కోల్పోతారు. సేకరిస్తున్న భూమిని ఆనుకొని ఉన్న ఆవడం, చిత్తాపూర్, కొంపల్లె, నారవాయిపేట, ఎదులాపురం గ్రామాల ప్రజలు ధూళికాలుష్యంతో భూగర్భ జలాల క్షీణతనూ, పేలుళ్ళ దుష్ప్రభావాన్నీ ఎదుర్కొంటారు. అవడం గ్రామంలోనూ కొంత భూమి పోతుంది. అదికూడా మామిడి తోటే.

ఇవి నిన్న మొన్న వేసిన మామిడి తోటలు కావు. 30-35 సంవత్సరాల వయసుగల చెట్లున్నాయి. బంగినపల్లేకాక, మన దగ్గర అరుదైన దస్సేరీ పళ్ళ చెట్లూ ఉన్నాయి. జెండా వెంకటాపూర్, శ్రావణపల్లి గ్రామస్తులంతా దళితులు, గిరిజనులు కావడంవల్ల మామిడి పళ్ళు అమ్ముకునే విషయంలో చాలాకాలం దళారుల మోసానికి బలయ్యారు. ఇప్పుడిప్పుడే వారిలోని యువతరం కాయల అమ్మకాన్ని తమ చేతిలోకి తీసుకొని దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నాగపూర్‌కు తీసుకుపోయి అమ్ముకు రావడం నేర్చుకుంది. ఎకరానికి 50 వేల నుంచి 80 వేల రూపాయల ఆదాయం పొందగలుగుతున్నారు. ఇప్పుడిప్పుడే మంచిబట్టలు వేసుకోవడం, పిల్లల చదువు గురించి ఆలోచించడం, పక్కా ఇళ్ళు కట్టుకునే సాహసం చేయడం మొదలయింది. ఇది 'అభివృద్ధి' కాదని ఇంగితం ఉన్న వారెవరూ అనరు. కానీ ఈ అభివృద్ధిని ధ్వంసం చేసి, బొగ్గు తవ్వి తీసి కరెంట్ భారీగా ఉత్పత్తి చేసి వార్షిక వృద్ధి రేటులో సింగపూర్‌ను, చైనాను దాటిపోతేనే 'అభివృద్ధి' అని మన్మోహన్‌సింగ్‌లు, రాజశేఖర్‌రెడ్డి భావిస్తున్నారు. అదే మన దురదృష్టం.

ఇప్పటికీ రేపు ఏం జరుగబోతుందో సింగరేణి యాజమాన్యంగాని, ప్రభుత్వంగానీ ప్రజలకు చెప్పదు. భూములు పోతాయి, ఓసిపి వస్తుంది అని గాలి వార్తలు మాత్రం ప్రచారం అవుతుంటాయి. స్పష్టంగా ఏమీ తెలియదు. ప్రజలు భయంభయంగా బతుకుతుంటారు. సమయం చూసి ఊరికి పది మందికి ఆశచూపి తమ ఏజంట్లుగా మార్చుకోవడానికి ఈ అనిశ్చిత అనువైన స్థితి అని ప్రభుత్వంవారు భావిస్తారు. కొందరికి ఓసిపిలో చిన్నా చితకా కాంట్రాక్టులు ఇస్తామంటారు. కొందరికి ఉద్యోగాలిస్తామని హామీలిస్తారు. రేపు నిర్వాసితులు గట్టిగా అడిగితే అందరికీ ఉద్యోగాలిస్తామంటారు గానీ ఓసిపిలలో ఉండే ఉద్యోగాలే కొన్ని కాగా అందులో మందమర్రి వంటి వెనుకబడిన ప్రాంతాల గ్రామీణ జీవులకు

అందుబాట్లోకి వచ్చేవి మరీకొన్ని. ఈ వాస్తవాన్ని ప్రజలు గ్రహించకపోతే ఉద్యోగం దొరుకుతుందన్న ఆశపెట్టుకొని జీవనాధారమైన భూమిని వదులుకోవడం జరుగుతుంది.

ఓసిపి తవ్వకం చేపట్టడానికి ఇది తప్ప వేరే అనువయిన ప్రాంతం లేదా? మెజారిటీ ప్రజలు నేతకాని కులానికి, లంబాడా తెగకూ చెందిన వారు కాబట్టి సులభంగా పనయిపోతుందని ఈ చోటును ఎంచుకున్నారా? ప్రభుత్వం నుంచి ఏ ఆసరా లేకుండా తమపాటికి తాము ఈ తరంలో జీవితాలు బాగుచేసుకున్న అట్టడుగు సామాజిక వర్గాల ప్రజల క్షేమం 'అభివృద్ధి' లెక్కలలో కనబడదా? పారిశ్రామీకరణ కోసం ప్రజలను వారి గ్రామాల నుంచి నిర్వాసితులను చేయకతప్పనట్టయితే వారి జీవన ప్రమాణం తగ్గని పద్ధతిలో వారికి సమ్మతమైన రీతిలో వారికి పునరావాసం కల్పించటం న్యాయం కాదా? దానికొక చట్టంగానీ, విధానంగానీ ఇప్పటికింకా దేశంలో ఎందుకు లేదు? ఇదిగో ప్రకటిస్తున్నా, అదిగో ప్రకటిస్తున్నా అంటూ కాలయాపన చేస్తూ, మరొకవైపు భూసేకరణ చేసుకుంటూ పోవడం ఏం న్యాయం? ప్రజలకు సమాచార హక్కు ఉందంటూ ఆర్భాటంగా చట్టం చేసేసి, ఇంత ముఖ్యమైన విషయంలో వారి నుంచి సమాచారాన్ని దాచిపెట్టి ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితిలో వారిని ఉంచడం ఏ పద్ధతి? ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విస్తరించి ఉన్న అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులు ఇప్పటివరకు తెలంగాణ ప్రజలకు ఉద్యోగ వనరులుగా కొనసాగాయి. పారిశ్రామిక విధానాల పుణ్యమా అని బొగ్గు గనుల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులు గణనీయంగా తగ్గించబడుతున్నారు. లాభాల మోజులో ఉన్న యాజమాన్యం నేడు స్థానికంగా ఉన్న గనులను మూసి ఓపెన్ కాస్టులపై మక్కువ చూపుతున్నది. ఈ దురాలోచన అమలులో స్థానిక ప్రజలు ఉన్న ఊరును, గూడును, బతుకునిచ్చిన పొలాలను ఓసిపి గనుల్లో కోల్పోతున్నారు. వారి జీవించే హక్కు అభివృద్ధి పేరుతో హరించబడుతోంది. స్థానికంగా వచ్చే పరిశ్రమలు స్థానికుల జీవన ప్రమాణాలను పెంచే విధంగా ఉండాలే గానీ, హరించే విధంగా ఉండకూడదనేది ప్రజాస్వామిక వాదులుగా మా అవగాహన. తెలంగాణ ప్రజల బతుకుల్ని బుగ్గి చేస్తున్న, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఓసిపి గనుల గురించి చర్చించుకొని వారికి న్యాయం జరిగేటట్టు ప్రభుత్వాన్నీ సింగరేణి యాజమాన్యాన్నీ నిలదీద్దాం రమ్మని అందరినీ ఆహ్వానిస్తూ...

ఆదిలాబాద్ జిల్లా శాఖ, 27-1-2008